వరికి మూషిక బెడద

- అన్నదాతకు అధిక వ్యయం
- దిగుబడిపై ప్రభావం పడే అవకాశం
- ఆందోళన చెందుతున్న రైతులు



ఎలుకల నిర్మూలనకు పొలంలో బుట్టలు అమర్చుతున్న రైతు



ఎలుకలను పట్టేందుకు బుట్టలు సిద్ధం చేస్తున్న దృశ్యం

పెద్దాపురం: గోరుచుట్టపై రోకలి పోటు అన్న చందంగా ఉంది నియోజకవర్గంలోని రైతుల పరిస్థితి. ఈ సార్వాలో రైతులకు అవసరంలేని సమయంలో కాకుండా వర్షాలు పడకూడదన్న సమయాల్లోనే వర్షాలు పడిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో కొన్ని చోట్ల నారు కొరత ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు రైతులు నానావస్థలు పడ్డారు. వరి చేలు ఇప్పుడిప్పుడే మొలకలు వచ్చి దుబ్బులు ఏర్పడుతున్న సమయంలో ఎలుకల బెడద ఎక్కువైంది. మూషికాలు మొలకలను కొరివేస్తుండంతో వాటిని అదుపు చేసేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రసాయనిక మందులు వాడినా ఎలుకల నిర్మూనల సాధ్యం కాకపోవడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు.

నివారణ చర్యలు చేపడుతున్నా ఫలితం శూన్యం

ఎలుకల నివారణకు వరి నూకల్లో తగిన మోతాదు రసాయనిక మందు కలిపి పొట్లాలు కట్టి పొలాల్లోని గట్లపై ఉండే ఎలక కన్నాల్లో బుట్టలను ఉంచుతున్నారు. ఎలుకల ఉధృతి అధికంగా ఉండడంతో ప్రస్తుతం ఈ విధానం ఫలితం ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఎలుకల నివారణకు బుట్టలు ఉపయోగించడం, పొగ పెట్టడం వంటి నివారణ చర్యలు తీసుకుంటున్నారు. బుట్టలు పెట్టే విధానంలో ఎరగా ఉంచిన ధాన్యం గింజలు తినడానికి వచ్చిన ఎలుక ప్రత్యేకంగా అమర్చిన వెదురు కర్రల మధ్య చిక్కుకుని మరణిస్తుంది. పొగ పెట్టే పద్ధతిలో ఎలుకలు తిరగాడే ప్రాంతాన్ని గుర్తించి అక్కడ కొంత మేర తవ్వి, కుండలో గడ్డి ఉంచి, నిప్పు పెట్టి పొగవచ్చేలా చేసి కన్నం వద్ద ఉంచుతారు. ఆ పొగకు కన్నంలో ఉన్న ఎలుక ఊపిరాడక చనిపోతుంది. ఈ విధానం ద్వారా ఒక్కో ఎలుకకు, రూ.60 చొప్పున తీసుకుంటారు. నియోజకవర్గంలో గ్రామాల్లో ఎలుకలు పట్టే వారికి మంచి డిమాండ్ ఉంది. ఎకరానికి రెండు నుంచి మూడు వేల రూపాయల వరకు ఎలుకలను పట్టేందుకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసిన ఎలుకల నిర్మూలన పూర్తిగా సాధ్యం కావడవం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో ఇవి దిగుబడిపై ప్రభావం చూపుతాయని కలవరపడుతున్నారు.

పంట నాశనమవుతోంది



ఎలుకల దాడికి గురైన వరి పంట సర్వనాశమవుతుంది. మార్కెట్లో దొరికే ఖరీదైన మందులు వాడినా ఎలుకలు తినడం లేదు. ఎలుకలు వరి దుబ్బుల మొదలంతా కొరికిపారేయడంతో మొక్క పూర్తిగా చనిపోతుంది. ఫలితంగా ఎకరానికి సుమారు 10 బస్తాలు దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

– సుందరెడ్డి రాజు, కౌలురైతు,. పులిమేరు, పెద్దాపురం మండలం

రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం



సామర్లకోట తహసీల్దార్‌ను అభినందించిన డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వోలు

సామర్లకోట: రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని, దీనికి అందరూ సహకరించాలని శనివారం తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన వై శ్రీనివాసు ఏలూరుకు బదిలీపై వెళ్లారు. దీంతో ఏలూరు జిల్లా కలెక్టరు కార్యాలయం నుంచి చంద్రశేఖరరెడ్డిని కాకినాడ జిల్లాకు బదిలీ చేసి సామర్లకోట తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. దాంతో ఆయన శుక్రవారం రాత్రి బాధ్యతలు స్వీకరించిన విషయం విదితమే. శనివారం ఆయన విధులకు హాజరై సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసు, వీఆర్వోల సంఘ నాయకులు తహసీల్దార్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎక్కువగా భూ సమస్యలు ఉంటాయని, తాను ఎక్కువ కాలం ల్యాండ్ సూపరింటెండెంట్‌గా పని చేయడంతో ఆ సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. అంతకు ముందు తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి అచ్చంపేట గ్రామంలో ఎమ్మెల్యే రాజప్పను మర్యాదపూర్వకంగా కలిశారు.

అత్తారింటికి వచ్చిన అల్లుడి ఆత్మహత్యాయత్నం

సామర్లకోట: అత్తారింటికి పిల్లలను చూడటానికి వచ్చిన అల్లుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన ఇది. ఎస్సై మూర్తి కథనం ప్రకారం వేట్లపాలెం శివారు జొన్నలదొడ్డిలో అత్తారింట్లో ఉంటున్న ఇద్దరు పిల్లలను చూడటానికి మోర్త సురేష్ శుక్రవారం రాత్రి వచ్చాడు. గొంచాలకు చెందిన సురేష్‌కు వేట్లపాలెం, జొన్నలదొడ్డికి చెందిన దీవెనతో వివాహమైంది. భార్య కువైట్‌లో ఉంటోంది. కువైట్‌లో ఉంటున్న భార్యకు శుక్రవారం రాత్రి ఫోన్ చేసి ఇంటికి వచ్చేయాలని డిమాండ్‌చేయడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్నట్టు స్థానికులు తెలిపారని ఎస్సై చెప్పారు. అదే విధంగా ఉదయం కూడా ఫోన్ చేసి భార్యతో గొడవ పడి నేను చనిపోతున్నానని చెప్పి సురేష్ బ్లేడ్‌తో పీక కోసుకున్నాడని ఎస్సై చెప్పారు. స్థానికులు వెంటనే సురేష్‌ను సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వచ్చారు. పరిస్థితి విషమించడంతో 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు వైద్యం చేయించుకోవడానికి సహకరించకపోవడంతో కౌన్సెలింగ్ అనంతరం సాయంత్రం వైద్యం ప్రారంభించినట్టు ఎస్సై తెలిపారు. క్షతగాత్రుని తండ్రి ప్రభాకరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్సై మూర్తి దర్యాప్తు చేస్తున్నారు.

అందరివాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



పిఠాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత, వైఎస్సార్‌సీపీ నాయకులు

- అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం
- వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి గీత

కొత్తపల్లి: ప్రపంచ వ్యాప్తంగా అందరూ మన్ననలను పొందిన మహనీయుడు డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ అందరివాడని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. పిఠాపురం పట్టణం రథాలపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. విజయవాడలోని ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనాన్ని కొందరు ధ్వంసం చేయడంపై ఆమె నిరసన తెలిపారు. దుండగుల దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ తీవ్రమైన దాడిని వైఎస్సార్ సీపీ ఖండిస్తుందన్నారు. విజయవాడలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహం నిర్మాణం దేశానికే ఎంతో ప్రతిష్టాత్మమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో విధ్వంసాలు పెరిగిపోతున్నాయన్నారు. స్మృతివనంలోకి ప్రవేశించి ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. అప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం ఇటువంటి దుష్ట చర్యలను మానుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మనుషులపై దాడులు చేసి హత్యలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబి, వైస్ చైర్మన్ పచ్చిమళ్ళ జ్యోతి, గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, మొగిలి అయ్యారావు, పిఠాపురం ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, వర్ధినీడి సుజిత, జవ్వాది నాయుడు, అరిగెల రామన్నాదొర, వెంకటేష్, కారే శ్రీనివాస్, ఆనాల సుదర్శన్ పాల్గొన్నారు.

దోమలతో ప్రమాదకర వ్యాధుల వ్యాప్తి



వాకతిప్పలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం

కొత్తపల్లి: డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమీలేదు. లక్షణాల కనుగుణంగా చికిత్సను అందించాలి. ఈ వ్యాధికి ప్లేట్‌లెట్లు తగ్గుతాయని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మ తెలిపారు. సీజనల్ వ్యాధులపై మండలంలోని వాకతిప్ప, యండపల్లి, అమీనాబాద్, కొత్తపల్లిలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల పర్యవేక్షణలో వైద్య శిబిరాలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీని వ్యాప్తిచేసే దోమ పగటి పూటే కుడుతుందన్నారు. ఈ దోమ కుట్టినప్పటి నుంచి ఒళ్లు నొప్పి, కళ్లు లాగడం, వాంతులు రావడం, చలితో కూడిన జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడంతోపాటు పలు లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యాధికి చికిత్స చేయించుకునే కన్నా నివారణ పద్ధతులపై దృష్టి సారించాలన్నారు. ఈ సీజన్‌లో దోమల నియంత్రణకు దోమ తెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ కాలంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఫ్లూ జ్వరాలు అధికంగా వచ్చే అవకాశం ఉందని వారిని ఉపాధ్యాయులు గుర్తించి పాఠశాలలకు రాకుండా ఇళ్ల వద్దే విశ్రాంతి తీసుకునేలా చూడాలన్నారు. పాఠశాలకు వస్తే ఇతర విద్యార్థులకు ఈ ఫ్లూ జ్వరాలు సోకే ప్రమాదం ఉందన్నారు.

శ్మశాన వాటిక దారి ఆక్రమణ

- పశువుల షెడ్డు నిర్మాణం
- పట్టించుకోని అధికారులు



కొత్తపల్లిలో ప్రభుత్వ స్థలం ఆక్రమించి ఏర్పాటు చేసిన పశువుల షెడ్డు

కొత్తపల్లి: ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు ఆక్రమణదారులు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. చెరువులే కాకుండా శ్మశాన వాటిక దారులను కూడా ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న పట్టించుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానికంగా పెద్ద చెరువును ఆనుకుని ఉన్న బందిలదొడ్డిలో పలు కులాలకు సంబంధించిన శ్మశాన వాటిక ఉంది. ఈ శ్మశాన వాటికకు వెళ్లే మధ్యలో పంట కాలువ ఆనుకుని రహదారిని ఆక్రమించి కొత్తపల్లికి చెందిన ఒక వ్యక్తి పశువుల షెడ్డు నిర్మించాడు. దీంతో శ్మశాన వాటికకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు చెరువు గట్టును ఆక్రమించి గడ్డిమేటు వేశాడు. గేదెలను రోడ్డుపైనే నిలిపివేయడంతో పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు. దీనిపై ఈఓపీఆర్డీ భాస్కరరావును వివరణ కోరగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే తొలగిస్తామన్నారు.

ప్రాచీన వారసత్వ సంపదను పరిరక్షించాలి



పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జిల్లాప్రతినిధులు

కాకినాడ రూరల్: సామర్లకోట-కాకినాడ కెనాల్ ప్రక్షాళన, మడ అడవుల సంరక్షణ, ప్రాచీన వారసత్వ సంపద పరిరక్షించుకోవాలని పీపుల్స్ వరల్డ్ కమిషన్ జిల్లా కమిటీ తీర్మానం చేసింది. పీపుల్స్ వరల్డ్ కమిషన్ ఆన్ డ్రాట్ అండ్ ఫ్లడ్ సంస్థ ఆధ్వర్యంలో కిరణ్ కంటి ఆసుపత్రి మీటింగ్ హాల్‌లో కాకినాడ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్, జాతీయ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణ చేపట్టిన కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహించిన సమావేశానికి సంస్థ ప్రత్యేక సలహాదారు పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. సంస్థ కో-ఆర్డినేటర్ ప్రెసింగి ఆదినారాయణ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత పర్యావరణ ప్రకృతి జీవ వైవిధ్యంపై వీడియో స్క్రీన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. భిన్నత్వం, వైవిధ్యంతో కూడుకున్న ప్రకృతి ప్రతిఫలమే మానవ సమాజమని ప్రకృతిని భిన్నత్వంలో గల సమాజాన్ని ఆధునిక నాగరికత అభివృద్ధి పేరిట వినాశనం చేసుకోకుండా పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ప్రధాన విషయాలను చర్చించారు. సామర్లకోట కాకినాడ కెనాల్ ప్రక్షాళన చేయాలని, మడ అడవుల విధ్వంసం ఆగాలని, ప్రాచీన వారసత్వ సంపద కట్టడాలను పరిరక్షించుకోవాలని, వరదలు ముంపు నివారణకు ముందస్తు ప్రణాళిక అవశ్యమన్నారు. తడి నేలలు ఆక్రమణకు గురికాకుండా చూసుకోవాలని, గ్రీనరీ పెంపుదలకు ప్రాధాన్యత ఉండాలని, గార్బేజ్ డంపింగ్ యార్డ్ ప్రజల నివాసాలకు దూరంగా వ్యవసాయ వినియోగం ప్రజా నివాసం లేని భూముల్లో ఆధునిక ఆదాయ ఉత్పత్తి కేంద్రాలుగా ఏర్పాటు చేయాలని అజెండా అంశాలను అభిప్రాయ వేదికలో కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రతి నెల నిర్దిష్ట సమావేశాన్ని నిర్వహిస్తామని ఆదినారాయణ తెలిపారు. జిల్లా కమిటీ ప్రతినిధులు లక్కరాజు సత్యనారాయణ దూసర్లపూడి రమణరాజు, ఏపీజే విను, ఎన్ కిషోర్ కుమార్, చిట్ల కిరణ్ కుమార్, ఆలపాటి శ్రీనివాస్, సీమకుర్తి సురేఖ పాల్గొన్నారు. ఎ.శ్రీవాణి, జీవీ రావు, జి లోవరాజు తదితరులు పర్యవేక్షించారు.

స్మార్ట్‌సిటీకి నిధుల గ్రహణం!



- అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేనా?
- రూ.194 కోట్ల బకాయిలు వచ్చేది ఎప్పుడో?
- 2025 మార్చి 31వ తేదీ వరకు గడువు పొడిగింపు

కాకినాడ: నిధుల కొరత కారణంగా కాకినాడ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు నత్తనడకన సాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.194 కోట్ల బకాయి రావలసిన నేపథ్యంలో ఈ పథకం ఎప్పుడు పూర్తవుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. రెండేళ్ల క్రితమే ప్రాజెక్టు కాలపరిమితి పూర్తయినప్పటికీ సకాలంలో నిధులు విడుదల కాని నేపథ్యంలో ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం రెండేళ్లుగా పెంచుకుంటూ వస్తోంది. వాస్తవానికి 2017లో కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కాకినాడను స్మార్ట్‌సిటీగా ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా 100 నగరాలు ఎంపిక చేయగా ఏపీ నుంచి నాలుగు ఎంపికయ్యాయి. అందులో కాకినాడ ఒకటి. ఈ ప్రాజెక్టు కింద రూ.978 కోట్ల ఖర్చు కాగల వివిధ ప్రతిపాదనలను అప్పట్లోనే ప్రతిపాదించి నివేదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యంతో చేపట్టాల్సిన పనులకు సంబంధించి అప్పట్లోనే ప్రతిపాదనలు పంపించారు. ఈ నిధులతో సుమారు రూ.400 కోట్లు ఖర్చు చేసి రహదారులు, డ్రెయిన్ల నిర్మాణం, రూ.100 కోట్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్, రూ.700 కోట్లతో బోటు బిల్డింగ్ యార్డు, రూ.20 కోట్లతో రాగిరెడ్డి కళాక్షేత్రం, రూ.10 కోట్లతో స్కేటింగ్ రింక్ వంటి అనేక పనులు చేపట్టారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు సంబంధించి తెలుగుదేశం హయాంలో కొన్ని అనవసర ప్రతిపాదనలు కూడా చేసి నిధులను సద్వినియోగం చేయలేకపోయారు. ఫలితంగా 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉన్న కొద్దిపాటి నిధులతోనే ప్రజాప్రయోజన ప్రాజెక్టులకు రూపకల్పన చేసి వినియోగంలోకి తెచ్చారు.

రూ. 194 కోట్ల బకాయి

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుతం రూ.194 కోట్లు వరకు బకాయి రావాల్సి ఉంది. ఇందులో రూ.186 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా, రూ.8 కోట్లు కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదల కావాల్సి ఉంది.

పెండింగ్ ప్రాజెక్టులపై ఆశలు

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కాలపరిమితిని వచ్చే ఏడాది 2025 మార్చి 31వ తేదీ వరకు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసే దిశగా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నప్పటికీ నిధుల కొరత వేధిస్తోంది. నిధులు లేని కారణంగా రూ.40 కోట్లతో చేపట్టిన నగరపాలక సంస్థ నూతన భవనం, రూ.15 కోట్లతో ప్రతిపాదించిన సైన్స్ సెంటర్, రూ.30 కోట్లతో ప్రతిపాదించిన పాఠశాలల అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదు. ఈ నిధులు సకాలంలో విడుదలైతేనే వచ్చే మార్చి చివరి నాటికి పనులన్నీ పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

కాకినాడ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కాలపరిమితిని వచ్చే ఏడాది మార్చి వరకు పెంచిన నేపథ్యంలో మిగిలిన నిధుల రాక కోసం స్మార్ట్‌సిటీ యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రావలసిన నిధులకు సంబంధించి ఇప్పటికే ఆయా ప్రభుత్వాలకు లేఖలు రాశారు. ఈ నిధులు విడుదల అయితే వచ్చే ఏడాది మార్చినాటికైనా స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

సుగర్ నిర్ధారణ పరీక్షలు

సామర్లకోట: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ సత్రంలో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి ఉచిత సుగర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ మేకా శ్రీనివాసరావు తెలిపారు. సామర్లకోట-భీమేశ్వరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, తగిన సూచనలు, సలహాలిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పిఠాపురం: గొల్లప్రోలులోని ఎంపీపీ పాఠశాల వద్ద శనివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ జెండాను గౌరవ అధ్యక్షుడు దాడి పద్మనాభం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ నాయకులు చేసిన అనేక త్యాగాల ఫలితంగా ఉపాధ్యాయులు పరిష్కారమయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి సూరిబాబు, గొల్లప్రోలు మండల అధ్యక్షుడు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

17న పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నిక



పాఠశాలలో ఎన్నికకు సంబంధించిన పత్రాలను నోటీస్ బోర్డులో ఉంచిన ఉపాధ్యాయులు

కొత్తపల్లి: కొండెవరం జిల్లా పరిషత్ పాఠశాలకు సంబంధించి పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికను 17న నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ తెలిపారు. కొన్ని అనివార్య కారణాల ఈ పాఠశాల ఎన్నిక వాయిదా పడిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 17న ఈ ఎన్నిక నిర్వహిస్తున్నామని తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

కొత్తపల్లి: బాలిక అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నాగులాపల్లి గ్రామానికి చెందిన ఒక బాలిక కాకినాడ ఆదిత్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం రాత్రి ఆ బాలిక ఇంటి నుంచి బయటకువెళ్లి తిరిగిరాలేదు. బాలిక అమ్మమ్మ ఇంటి వద్దే ఉంటూ చదువుకుంటోంది. దీంతో అమ్మమ్మ వడిశెట్టి పాపిరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా శంకరంబాడి సుందరాచారి జయంతి



శంకరంబాడికి నివాళులర్పిస్తున్న బోట్‌క్లబ్ వాకర్స్

కాకినాడ రూరల్: మన రాష్ట్ర గీతమైన మా తెలుగు తల్లి గీతాన్ని రచించిన శంకరంబాడి సుందరాచారి మహాకవి అని ప్రముఖ సాహిత్య వేత్త డాక్టర్ శిరీష పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శంకరంబాడి సుందరాచారి జయంతిని శనివారం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1914 ఆగస్టు 10న తిరుచానూరులో జన్మించిన సుందరాచారి మూఢనమ్మకాలుగా భావించిన కొన్ని ఆచారాలను నిరసించారని అన్నారు. అప్పటి భారత రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్, ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తదితరులు శంకరంబాడిని సత్కరించారని అన్నారు. అడబాల రత్నప్రసాద్, జి.కృష్ణమోహన్, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, స్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని నీలాద్రిరావుపేట వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని యల్లమిల్లికి చెందిన మంగిన వీరబాబు, కొల్లి వెంకట్రావు యల్లమిల్లి నుంచి జగ్గంపేటకు ఆటోలో వెళుతున్నారు. నీలాద్రిరావుపేట ఆదిత్య హాస్పటల్ సమీపంలోకి వచ్చేసరికి వారు ప్రయాణిస్తున్న ఆటోను వెనుకు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న వీరబాబు, ప్రయాణికుడు వెంకట్రావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

జీజీహెచ్‌లో డాక్టర్ బైక్ అపహరణ

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ఓ వైద్యుడి బైక్ అపహరణకు గురైంది. తమిళనాడుకు చెందిన డాక్టర్ ఆర్.అరవిందన్ మెడిసిన్ పూర్తి చేసి కాకినాడ ఆర్‌ఎంసీలో పీజీ చేస్తున్నారు. కాకినాడ జీజీహెచ్ ఎదురుగా ఉన్న పీజీ హాస్టల్‌లో ఉంటున్న ఆయన ఈ నెల 6న జీజీహెచ్‌కు డ్యూటీకి వచ్చాడు. ఉదయం 11 గంటలకు తన ద్విచక్ర వాహనంపై వచ్చి ఎమర్జెన్సీ వద్ద ఉన్న పార్కింగ్‌లో తన వాహనాన్ని నిలిపారు. విధులు ముగించుకొని వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో సెక్యూరిటీ సిబ్బందిని, సహ వైద్యుల్ని ఆరా తీశారు. ఆసుపత్రి సీసీ కెమెరాలను పరిశీలించి ఫలితం లేకపోయింది. దీంతో శనివారం కాకినాడ వన్‌టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. డాక్టర్ అరవిందన్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షురాలు ప్రసూన

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరకుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు ఎం.ప్రసూన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో సభ్యులందరూ తమ సంపాదనలో కొంత శాతాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నామని అన్నారు. ప్రముఖ సాహిత్య వేత్త డాక్టర్ శిరీష మాట్లాడుతూ పరోపకార గుణంతో జీవిస్తేనే జీవితం సార్థకమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి శ్రీదేవి రెడ్డి, అడబాల రత్న ప్రసాద్ ,చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, జి.కృష్ణ మోహన్, రాఘవరావు పాల్గొన్నారు.

శ్రీవారి పాదాల వద్ద కలశాలకు పూజలు

బోట్‌క్లబ్: 3,500 మెట్లు 7 కొండలు 4 గోపురాలు కలిగిన తిరుమల తిరుపతి సాక్షాత్తు విష్ణుమూర్తి స్వయంభువుగా వెలసిన ఏడుక్షేత్రాల్లో మొదటిదని భోగి గణపతి వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. శనివారం భోగి గణపతి పీఠంలో వేంకటేశ్వరస్వామి సుప్రభాత సేవ నిర్వహించారు. పీఠం ప్రాంగణంలోని శ్రీవారి పాదాల వద్ద సహస్ర పారాయణతో శ్రీదేవి భూదేవి బాలాజీ కలశాలకు పూజలు నిర్వహించారు. 44వ జపయజ్ఞ పారాయణ సందర్భంగా పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణ రాజు తిరుమల తిరుపతి క్షేత్ర విశిష్టతను తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగాపై విస్తృత ప్రచారం

కరప: ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఆదివారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించేలా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆ కార్యక్రమ ఇన్‌ఛార్జ్ సలాది అనిల్ కోరారు. నడకుదురులో శనివారం నిర్వహించిన మండల బీజేపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12, 13,14 తేదీల్లో యుద్ధ స్మారకాలను సందర్శించి, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలన్నారు. 14న దేశ విభజన జరిగిన నేపథ్యంలో మౌన ప్రదర్శన నిర్వహించి జాతీయ పండగ నిర్వహించాలన్నారు. జాతీయ పతాకంతో సెల్ఫీ తీసుకుని, దానిని హర్ తిరంగా.కామ్ వెబ్‌సైట్‌లో పోస్టు చేయాలన్నారు. ఈసమావేశానికి మండల బీజేపీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్ అధ్యక్షత వహించారు.

మహిళా వైద్యురాలిపై అఘాయిత్యం అమానవీయం

కాకినాడ క్రైం: కలకత్తాకు చెందిన పల్మనాలజీ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన దేశాన్ని కుదిపేస్తోంది. ఈ నేపథ్యంలో అసోసియేషన్ ఆఫ్ పల్మనాలజిస్ట్ ఆఫ్ సీమాంధ్ర (ఏపీఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు, కాకినాడ జీజీహెచ్ పల్మనాలజీ విభాగ విశ్రాంత హెచ్‌వోడీ డాక్టర్ కె.రాజేంద్రకుమార్ మాట్లాడుతూ జరిగిన దారుణాన్ని తీవ్రంగా ఖండించారు. తన వైద్య సేవలతో కోవిడ్‌తో సహా విపత్కర వేళలో ఎందరో ప్రాణాలకు అండగా నిలిచిన పల్మనాలజీ వైద్యురాలిని దారుణంగా హతమార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 8న రాత్రి నార్త్ కలకత్తాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజ్ కమ్ గవర్నమెంట్ హాస్పిటల్‌కి పేద ప్రజలకు సేవలందించేందుకు నైట్ డ్యూటీకి వెళ్లిన బాధిత వైద్యురాలు 9వ తేదీన ఉదయం 7.30 గంటల సమయంలో వివస్త్రగా, విగతజీవిగా, శరీరం మొత్తం తీవ్ర గాయాలతో అత్యాచారానికి గురై హృదయ విదారక స్థితిలో సెమినార్ హాల్‌లో కనిపించిందన్నారు. ఘటనకు బాధ్యుడ్ని చేస్తూ సంజయ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినా మరింత లోతైన విచారణ జరిపి బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా వైద్యుల భద్రతపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.